



వేరుశనగ సబ్సిడీ ఖరారు

40 శాతం రాయితీ ◆ ట్రైబల్ ఏజెన్సీలకు 90 శాతం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ విత్తనకాయల సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. సాధారణ రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వగా, ట్రైబల్ రైతులకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించారు. కె-6కిలో సేకరణ ధర రూ.93 కాగా, కదిరి లేపాక్షి (కె-1812) రకం రూ.83గా నిర్ణయించింది. వీటికి 40 శాతం సబ్సిడీ ఇచ్చారు. దీని ప్రకారం కె-6కు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ప్రకారం కిలోపైన రూ.37.20 ఇవ్వనుంది. రైతు చెల్లించాల్సింది కిలోపై రూ.55.80గా ఉంది. అదే ట్రైబల్ ఏజెన్సీల్లోని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ ప్రకారం కిలో రూ.9.30 చెల్లిస్తే సరిపోతుంది. ఇక కదిరి లేపాక్షి రకం 40 శాతం సబ్సిడీ ప్రకారం రూ.49.80 రైతు చెల్లించాలి. ట్రైబల్ ఏజెన్సీల్లో రైతులు 90 శాతం సబ్సడీ ప్రకారం రూ.8.30 కిలోకు చెల్లించాల్సి ఉంటుంది.

గరిష్టంగా మూడు బస్తాలు

వేరుశనగ విత్తనకాయలకు సంబంధించి 30 కిలోల ఒక బస్తా చొప్పున పంపిణీ చేయనున్నారు. అర ఎకరానికి ఒక బస్తా, ఆపైన ఒక ఎకరా వరకు అయితే రెండు బస్తాలు, ఒక ఎకరాపైన ఉన్న రైతులకు మూడు బస్తాలు గరిష్టంగా ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఖరీఫ్‌లో విత్తన పంపిణీకి సంబంధించి కేటాయింపులను ప్రభుత్వం జరిపింది. అనంతపురం జిల్లాకు 78245 క్వింటాళ్ల కేటాయించారు. సత్యసాయి జిల్లాకు 100907 క్వింటాళ్లు ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనం కింద పంపిణీ చేయాలని నిర్ణయించారు.

పంపిణీ ఎప్పుడో .?

వేరుశనగ విత్తనకాయలను సాధారణంగా మే నెలలోనే పంపిణీ చేపట్టేవారు. కాని ఈసారి సేకరణ ధరయే ఇప్పుడు ఖరారైంది. ఇప్పుడు సేకరణ ప్రారంభించి ఎప్పటికి పంపిణీ జరుగుతుందన్నది చూడాల్సి ఉంది. గతంలో లాగా మన విత్తనం సొంత విత్తనం కింద కూడా రబీలో విత్తనకాయలు ఇవ్వలేదు. పూర్తిగా ప్రయివేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు కూడా ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవడంతో నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత నేరుగా ఆగ్రామాలకు విత్తనకాయలను అందజేయడం జరుగుతుంది. ఇప్పటికే వర్షాలు కూడా పడుతుండటంతో రైతులు దుక్కులు దున్నుకునే పనిలో ఉన్నారు. జూన్ మొదటి వారంలో మరోమారు మంచి వర్షాలొస్తే విత్తనం విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. అంతలోపు విత్తన పంపిణీ ప్రారంభమయితే రైతులు సకాలంలో విత్తనం వేసుకుంటారు.

సంక్షోభంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

◆సోషలిజమే ప్రత్యామ్నాయం
◆నాడు మార్క్స్ చెప్పిందే నేడు రుజువు అవుతోంది..
◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
◆అనంతలో 'ప్రపంచ ఆర్థిక మాంద్యం- ప్రజలపై ప్రభావాలు' సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సదస్సుకు హాజరైన ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభాల మయమని నాడు కారల్ మార్క్స్ చెప్పారని, అదే నేడు రుజువు అవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-ప్రజలపై ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కమ్యూనిజానికి కాలం చెల్లింది... కాలంతోపాటు మారాలి అని చెప్పే వారికి ఇప్పుడు పరిస్థితులు ఎవరు మారాలన్నది స్పష్టం చేస్తున్నాయని గుర్తుచేశారు. మారాల్సింది కమ్యూనిస్టులు కాదు... పెట్టుబడి మద్దతుదారులన్నది స్పష్టమవుతోందని చెప్పారు. నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది తెలిపారు. ప్రపంచం ఆర్థిక వ్యవస్థలో కీలకంగా చెలామణి అవుతున్న డాలర్ విలువనే ఇప్పుడు రోజురోజుకూ పడిపోతోందని వివరించారు. దీన్ని కాపాడుకోలేని స్థితిలోకి అమెరికా వెలుతోందన్నారు. రెండు వందల సంవత్సరాల క్రితమే కారల్ మార్క్స్ ఈ సమాజలోని అంతరాలు, బాధలకుగల కారణాలను పరిశోధించి తర్కించి సమాజంలోని అంతర్గత సూత్రాన్ని గ్రహించి సమాజ గమనానికి మూల కారణం శ్రమ అని తెలియజేసారని గుర్తుచేశారు. ఈ శ్రమ ద్వారానే సంపద సృష్టించబడుతోందని చెప్పారు. అయితే ఇది కొద్ది మంది పెట్టుబడిదారీ చేతుల్లోకే వెలుతోందన్నారు. దీనికి మద్దతుగా పాలకులు ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా శ్రమజీవులు ఏకమై పోరాడినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని వివరించారు. కారల్‌మార్క్స్ చెప్పిన ఈ సూత్రానికి అనుగుణంగా ప్రజలను సమైక్యపరచి దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ నేడు ప్రపంచాన్ని సంక్షోభం పట్టి పీడిస్తోందని చెప్పారు. ఇది కమ్యూనిస్టులు చెబుతున్న మాటకాదని, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ఐక్య రాజ్యసమితి వంటి సంస్థలే చెబుతున్నాయని గుర్తు చేశారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధియే స్తంభించిపోతుందని ఆయా సంస్థలే ప్రకటిస్తున్నాయని తెలిపారు. 2023 అక్టోబరు నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తారా స్థాయికి చేరుతుందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షులే ఇటీవల ప్రకటించారని చెప్పారు. ప్రపంచంలో సుమారు 70 దేశాల్లో ఇది మరింత తీవ్రంగా ఉండే అవకాశముందని ఆర్థిక నిపుణులు సైతం అంచనా వేస్తున్నారన్నారు. ఈ సంక్షోభాలతో ఉపాధి మరింత మందిగించడమే కాకుండా ఉన్న ఉపాధిని కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయన్న అంచనాలు వేస్తున్నారన్నారు. దేశంలో సుమారు నాలుగు కోట్ల మంది నిరుద్యోగులవుతారన్న కూడా చెబుతున్నారన్నారు. ఇంతటి తీవ్రమైన సంక్షోభాలకు కారణం ఆర్థిక వ్యవస్థలోనున్న లోపాలే కారణమని చెప్పారు. ఇదే విషయాన్నే నాడు మార్క్స్ తన సిద్ధాంతం ద్వారా తెలియజేసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, చంద్రశేఖర్, రిటైర్డు డిఆర్ఓ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం...

440 మందికి రూ.3.12 కోట్లు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోపా పథకం కింద జిల్లాలో 440 మందికి రూ.3.12 కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కళ్యాణమస్తు, షాదీతోఫా పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ పథం ద్వారా అందిని మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల తల్లుల ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి మంజునాథ్, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8 నుంచి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో పనిచేస్తున్న గ్రంథాలయాలలో ఈ నెల 8 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులు, పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎమ్.గౌతమి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. సమ్మర్ క్యాంపులో పిల్లలకు డ్యాన్స్, వకృత్వం, వ్యాసరచనం తదితర పోటీలను నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ తెలిపారు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై జెసికి వినతి

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని గౌడనహళ్లి బీసీ కాలనీలో కొత్తగా వేసిన బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి తాగునీటి సమస్య తీర్చాలని మహిళలు శుక్రవారం మెళవాయిలో జాయింట్ కలెక్టర్ చేతన్‌ను కలిసి వివరించారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. దీనిపై స్పందించిన జేసీ వెంటనే ఈ సమస్యను తీర్చాలని ఎంపీడీఓ సోనిబాయికి సూచించారు.

'ఉపాధి'ని పాతపద్ధతిలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న ఆధ్వర్యంలో పరిశీలించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమత్‌సర్ పేరుతో చేపట్టిన చెరువు పూడికతీత పనుల్లో పని భారం ఎక్కువ అన్నారు. రోజూ నీటి బిందెలతో నేలను తడిపి పని చేస్తుండడంతో అరచేతిలో బొబ్బలు వచ్చి మంట వేస్తుందన్నారు. ఆ బాధ భరించలేక వైద్యం కోసం రోజూ రూ. 60 ఖర్చు చేస్తున్నామని, పని మార్చమని ప్రాధేయపడినా అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో కూలీలు ఈ పనికి రాలేదని తెలిపారు. దీనికి తోడు 4 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కూలీలకు ఇష్టం లేని పనులు చేపట్టి చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని,సబ్సిడీలు ఎత్తి వేస్తూ పథకాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కూలీలు ఐక్యంగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని, అలాగే పాత పద్ధతిలోనే పథకాన్ని కొనసాగించాలని, ఏదాదికి 200 రోజులు పని, రోజు కూలి రూ. 600 ఇవ్వాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 22వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఇళ్లపట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్



పేదలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-నల్లచెరువు

నల్లచెరువలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు భూ స్వాధీన పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని కె.పూలకుంట రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 406లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ పేదలు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితం భూస్వాధీన పోరాటం నిర్వహించారు. అందులో జెండాలు పాతి, గుడిసెలు వేసుకుని అక్కడే వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు జిఎల్.నరసింహులు తదితరులు అక్కడికెళ్లి పేదలతో మాట్లాడారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ గత 14 నెలల క్రితం ఇదే భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వాలని జెండాలు పాతి భూస్వాధీన పోరాటం చేశామని చెప్పారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు 90 రోజుల్లో ఇంటి పట్టా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అర్జీలు ఇచ్చి సంవత్సరం పైగా అవుతున్నా ఇప్పటివరకు వారికి పేదలకు పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం పేదలు అక్కడే గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు మాట్లాడుతూ పేదల ఇంటి స్థలాల సమస్యను గుర్తించి వెంటనే వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో సిపిఎం ఆధ్వర్యంలో పేదల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, మండల సిఐటియు కార్యదర్శి రామకష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, సదాశివ, మురాషా, బావయ్యతో పాటు పేదలు పాల్గొన్నారు.

రైతులే దేశానికి గొప్ప శాస్త్రవేత్తలు

◆ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం
◆కేంద్ర వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం శాఖ కార్యదర్శి మనోజ్ అహుజా

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు సాధించిన రైతులు దేశానికి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగారని కేంద్ర వ్యవసాయ మరియు ప్రకృతి వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహుజా పేర్కొన్నారు శుక్రవారం నాడు మడకశిర మండలం మెల్లవాయి గ్రామపంచాయతీలో కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి పర్యటించారు. రాష్ట్ర పకతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంచి ఫలితాలు సాధించిన మహిళా శాస్త్రవేత్తలు, క్షేత్ర స్థాయిలో పంట పొలాలు, పొదుపు మహిళా సంఘాలతో ప్రత్యక్షంగా వారి అనుభవాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ అడిషనల్ సెక్రెటరీ యోగితరానా, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, రైతు సాధికార సంస్థ విజయ్ కుమార్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. అనంతరం మెలవాయి ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ సెక్రెటరీ మాట్లాడుతూ పకతి వ్యవసాయ మూల సూత్రాలను అర్థం చేసుకోగలిగితే వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కొందరు రైతులు అరుదైన పంటలు సాగు చేయడంతో పాటు సహకార సంఘాల ద్వారా మార్కెటింగ్ చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలా వెనుకబడిన మారుమూల ప్రాంతమైన మెలవాయి గ్రామంలో ప్రతి వ్యవసాయంలో మహిళలు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయం అన్నారు. ఇక్కడి రైతులు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సకాలను రైతులు సద్వినియోగం చేసి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ పరిశీలనలో కేంద్ర బృందం సభ్యులు గుడిబండ మంలం బూదిపల్లి, రాళ్లపల్లి, కదిరేపల్లిలో పర్యటించి అక్కడి పంట పొలాలను పరిశీలించారు. మడకశిరలో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఆటోస్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నూతనంగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేయగా శుక్రవారం ఎస్ఐ రమేష్ బాబు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులపై భారాలు వేస్తున్నాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచుతూ బడా కంపెనీలకు రాయితీలు ఇస్తున్నాయన్నారు. భవిష్యత్తులో ఆటో కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతర పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, మహబూబ్ బాషా, వజ్రం నాగప్ప, షరీఫ్, ఆటో యూనియన్ నాయకులు ఆంజనేయులు, రంగప్ప, సనావుల్లా, బాబా పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల మండల పరిధిలోని మల్లాపల్లి జగనన్న కాలనీకి శుక్రవారం మండల అభివద్ధి అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మూడు రోజుల క్రితం జగనన్న కాలనీలో పర్యటించారు. ఆ సమయంలో కాలనీలో తక్షణం మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అలాగే హిందూపురం-గోరంట్ల ప్రధాన రహదారిలో మల్లాపల్లి వద్ద గోరంట్ల పట్టణంలోని పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఆ స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టగా నీటి సమస్య తలెత్తడంతో కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందించిన ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా హౌసింగ్ మండల అధికారి జగదీష్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన బోరుకు మోటారు, పంపుసెట్‌ను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు. త్వరలో పైప్‌లైన్ ఏర్పాటు చేసిన కాలనీ అంతటికీ నీటి సౌకర్యం కల్పిస్తామని ఎంపిడిఓ తెలియజేశారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

డిఐజి ఆర్ఎన్. అమ్మిరెడ్డి



మహిళా పోలీసుకి రివార్డు అందజేస్తున్న డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సచివాలయాల్లోకి మహిళా పోలీసులు రాకతో పోలీసు యంత్రాంగం మరింత బలోపేతమైం దని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్. అమ్మిరెడ్డి అభిప్రాయపడ్డారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి సాయి ఆరామంలో జిల్లాలోని మహిళా పోలీసులతో ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డిఐజి అమ్మిరెడ్డి మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు. సమాజానికి, పోలీసులకు మధ్య వారధిగా విధులు నిర్వర్తించాలని కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలన్నారు. గ్రామాలలో మహిళలకు, బాలికలకు వారి హక్కులను పరిరక్షణ విషయంలో అమ్మ పాత్ర పోషించాలని కోరారు. మహిళా పోలీసుల సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని డిఐజి అభినందించారు. బాల్యవివాహాలను సమూలంగా నిర్మూలించుటకు సహకరించాలని సూచించారు. విధి నిర్వహణలో వ్యక్తిగత భద్రతను చూసుకుంటూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి నెల జరిగే క్రైమ్ మీటింగ్‌లో జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ తో పనిచేసిన మహిళా పోలీసులకు 10 మందికి తగ్గకుండా అవార్డులు, రివార్డులతో ప్రోత్సాహకాలను కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. మహిళా పోలీసులందరూ సైబర్ క్రైమ్‌పై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని అలాఅయితేనే గ్రామాల్లో ప్రజలకి, నిరక్షరాస్యులకు వాటిపై అవగాహన కల్పించి వారు సైబర్ క్రైమ్ బారిన పడకుండా చూడగలుగుతారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా పోలీసులకు సేవలు పట్ల ఎంతో సంతృప్తికరంగా ఉందని చెప్పారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరిచి నేర నివారణ నియంత్రణ చేయుటకు సహాయ సహకారాలు అందించిన మహిళా పోలీసులకు ప్రశంసాపత్రాలు జ్ఞాపికలను డిఐజి, ఎస్పీ అందజేసి అభినందించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం సందర్శించిన డీఐజీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ బ్రాంచీలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు హుస్సేన్ పీరా, వాసుదేవన్, ఎస్‌బి డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆఆర్ డీఎస్పీ విజయ కుమార్, దిశా సిఐ లక్ష్మన్న, ఎస్‌బి సి ఐ రవీందర్ రెడ్డి, పట్టణ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డితో పాటు ఎఆర్ సిబ్బంది, జిల్లా పరిధిలోని మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గెజిట్ మేరకు నిబంధనల అమలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలకసంఘంలోని వాణిజ్య సముదాయం, కూరగాయాల మార్కెట్‌లో బహిరంగ వేలం సమయంలో రూపొందించిన గెజిట్ మేరకు అన్ని నిబంధనలు అమలు చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయం, మార్కెట్‌ను వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా వారి సమస్యలను ఛైర్‌పర్సన్‌కు, కమిషనర్‌కు వివరించారు. గెజిట్‌ను తప్పని సరిగా అమలు చేయడంతో పాటు వ్యాపారాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు పుపాలక సంఘం తరపున కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మురుగు దొడ్ల నిర్వహణ కోసం, కూరగాయాల హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయించాల్సిన స్థలాలను, పూల వ్యాపారులకు మార్కెట్ అండర్ గ్రౌండ్‌లో కేటాయించే స్థలాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆనంద్ కుమార్, డిఇఇ నీరజ, వార్డు ఇన్‌ఛార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలపై దృష్టి సారించాలని వినతి

హిందూపురం: చిన్నపాటి వర్షాలకే ముక్కడిపేటలో మురుగు కాలువలు నిండి మురుగు నీరు రోడ్డుపై రావడంతో పాటు ఇండ్లల్లోకి సైతం మురుగు నీరు రావడంతో నివాసం ఉండలేక పోతున్నామని 7వ వార్డు ముక్కడిపేట వాసులు కమిషనర్ ప్రమోద్ కుమార్ ముందు వాపోయారు. శుక్రవారం ముక్కడిపేట ప్రాంతానికి చెందిన మహిళలు ఈ విషయంపై కమిషనర్‌ను కలిసి వారి సమస్యను వివరించారు. మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగించే సమయంలో చూపించే శ్రద్ధ, ఆక్రమణలను తొలగించిన అనంతరం మురుగు కాలువలు, రోడ్డు మరమ్మతులో చూపించడం లేదన్నారు. ముక్కడిపేటలో ఆక్రమణలను తొలగించి నూతనంగా నిర్మాణం చేస్తున్న మురుగు కాలువ పనులు సకాలంలో పూర్తి చేయక పోవడంతో రెండు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మురుగు నీరు ప్రవహించి, మురుగు అంత రోడ్డుపైకి వచ్చిందన్నారు. దీంతో అక్కడ నివాసం ఉండలేక పోతున్నామన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ తానే స్వయంగా అక్కడికి వచ్చి పరిశీలన చేసి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



వాణిజ్య సముదాయం, మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్

రైతు ఆత్మహత్యపై విచారణ

ఓబుల దేవరచెరువు : మండల పరిధిలోని ఆకుతోటి పల్లిలో గత ఏడాది నవంబర్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటరమణప్ప కుటుంబాన్ని డివిజన్‌స్థాయి విచారణ కమిటీ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. కమిటీ సభ్యులు ఆర్డీవో భాగ్యరేఖ, ఎడి సత్యనారాయణ, తహశీల్దార్ శ్రీధర్, ఎస్ఐ గోపీ, వీఆర్వో శ్రీలత తదితరులు రైతు నివాసానికి వెళ్లి భార్య , ముగ్గురు ఆడ పిల్లలతో మాట్లాడారు. వెంకటరమణప్ప ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంలో అధిక నష్టం రావడంతో అప్పులు ఎక్కువై వాటిని తీర్చే దారి లేక అప్పులు ఇచ్చిన వారికి నచ్చజెప్పలేక ఆత్మహత్య చేసుకున్నాడని రైతు కుటుంబసభ్యులు అధికారులకు వివరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : తనకల్లు మండలం రాచినేపల్లి పంచాయతీలోని రాముల ఆలయ అభివృద్ధికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని గ్రామస్తులు కోరగా స్పందించిన బత్తల హరిప్రసాద్ తనవంతుగా రూ. 25వేలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు గ్రామ యువకులు ఆదెపపనాయుడు, తిమ్మయ్య నాయుడు, లేపాక్షి నాయుడు, సుధాకర్ నాయుడు, జనార్ధన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


విరాళం ప్రకటిస్తున్న బత్తల హరిప్రసాద్

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లచెరువు : మండలపరిధిలోని అర్హులైన చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎపిఎం మంజుల కోరారు.ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి గాను పండ్ల మొక్కలు పెంపకం క్రింద నీటి సౌకర్యం వున్న సన్న,చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మామిడి, మునగ, సపోటా, అల్లనేరేడు, దానిమ్మ, తదితర 17రకాల మొక్కలను సరఫరా చేయనున్నామని అర్హత, ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విగ్రహాల ప్రతిష్టాపన

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రానికి సమీపంలో ఎం. కొత్తపల్లి బండపై వెలసిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాగణపతి, వేలాయుధ సుబ్రహ్మణ్యం, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని పండితులు పంచరత్న సురేష్ శర్మ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహాల దాతలు ఆర్ఆర్ బ్యాంగిల్ సెంటర్ రాము, ఎఎస్ఐ కే.కిషోర్ రెడ్డి, తహశీల్దార్ కునుకుంట్ల శ్రీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

తలుపుల : మండల పరిధిలోని ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల 1వ అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఓ రామానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు, గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించాలని అంగన్వాడీ కార్యకర్తలు సంజన, సునీత, లలితకు సూచించారు.

వీరఓబమ్మ ఉత్సవాలు

రామగిరి : మండల పరిధిలోని, గరిమేకలపల్లి గ్రామంలో 30 సంవత్సరాల తర్వాత జరుగుతున్న లక్ష్మి నరసింహ స్వామి, వీర ఓబమ్మ దేవి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు పరిటాల శ్రీరామ్ దంపతులు, పరిటాల సునీతమ్మ , గుండుమల తిప్పేస్వామి, ఎల్ నారాయణ చౌదరి కుటుంబ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ రామమూర్తి నాయుడు , మాజీ ఎంపిపి రంగయ్య, శ్రీధర్ నాయుడు ఇతర నాయకులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన జయచంద్ర అనే వ్యక్తి నరాల బలహీనతతో ఆరోగ్యం బాగా లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో బాధితుడిని ఆదుకోవాలని 14వ వార్డ్ కౌన్సిలర్ మహబూబ్ బాషా పట్టణ అధ్యక్షులు బహావుద్దీన్ ద్వారా వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను కోరారు. దీంతో స్పందించిన ఆయన బాధితుడి కుటుంబానికి వారి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కెఎస్. బాహుద్దీన్, వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, 14వ వార్డ్ కౌన్సిలర్ మహబూబ్ బాషా, బీసీ నాయకులు సంపంగి గోవర్ధన్, బత్తల యువసేన సభ్యులు ముబారక్, బాబ్జాన్, కిరణ్, రాఘవేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న 'పల్లె'

బుక్కపట్నం : మండల పరిధిలోని జానకంపల్లిలో శుక్రవారం నిర్వహించిన మల్లాలమ్మ స్వామి జాతరలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తెలుగు యువత నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసులు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

కదిరిటౌన్ : కదిరి ఏరియా ఆసుపత్రిని కదిరి డివిజనల్ పంచాయతీ అధికారి దేశంగారి అంజనప్ప శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్లడ్ బ్యాంకు, డయాలసిస్ కేంద్రం, కాన్పుల వార్డును తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రూ.18 కోట్ల అంచనాతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం సంతేబిదునూరు గ్రామంలో ఆంజినేయ స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇక్బాల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి లలిత రాము, జెడ్పీటీసీ నాగభూషణం, వైసీపీ నాయకులు బసిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, సర్పంచి ఆనంద్, రూరల్ మండలం నాయకులు బక్రు సాబ్, దేవరపల్లి రామాంజి, మల్లేష్, ఆనంద్ రెడ్డి, బసప్ప, సిపిసి సాదిక్, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

రామగిరి: అకాల వర్షాల వలన దెబ్బతిన్న వేరుశనగ పంట పొలాలను ఎంపీపీ కరెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల వ్యవసాయ అధికారి మురళికృష్ణ శుక్రవారం పరిశీలించారు. నసనకోట హెచ్ఎస్ ముత్యాలు పొలాన్ని పరిశీలించారు. ముత్యాలు నాలుగు ఎకరాలలో వేరుశనగ సాగు చేయగా పంట కోతకు రావటంతో వేరుశనగను తొలగించి పొలంలోనే కుప్పలు పెట్టాడు. అయితే ఆకాల వర్షాలకు వేరుశనగ పూర్తిగా తడిసి దెబ్బతినిందని రైతు వాపోయాడు. తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు. ఈ కార్యక్రమంలో జ్యేష్ట రామయ్య, జై ముత్యాలు, ఎఇఒ లక్ష్మీనారాయణ, విఎఎ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం

కొత్తచెరువు : కొత్తచెరువులో చెరువు కట్ట వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయ రథోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి యేటా కార్తీక శుద్ధ పౌర్ణమి రోజు ఈ బ్రహ్మ రథోత్సవ వేడుకలు కందికేరి వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ రథోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి వెంకట్రాంరెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ జయ నాయక్, ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజు, నాగేందర్, ప్రసాద్, గిరీష్, గ్రామ సర్పంచి రాధా నాగరాజు, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధం సాధ్యమేనా..? అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శుక్రవారం తన చాంబర్‌లో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘ వ్యాప్తంగా 43 సచివాలయాలున్నాయని, ఎవరి సచివాలయ పరిధిలో వారు ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. దీని కోసం వార్డు అడ్మిన్ సెక్రటరీ, వార్డు వాలంటీర్లు ప్రత్యేక టీములుగా ఏర్పాటై తనఖీలు ముమ్మరం చేయాలన్నారు. వీరితో పాటు మున్సిపల్ అధికారులు సైతం మెయిన్ బజారు, బెంగళూరు రోడ్డు, విడి రోడ్డు తదితర ప్రాంతాల్లో అకస్మిక తనఖీలు నిర్వహిస్తారన్నారు. ఇకపై ఎవరి సచివాలయ పరిధిలో అయినా నిషేదిత ప్లాస్టిక్ ఉంటే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పని సరిగా ఎన్‌జిటి నిబంధనలు అమలు చేయాల్సిన బాధ్యత శానిటేషన్ సెక్రటరీలపై ఉందన్నారు. నిబంధనలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సమగ్ర మార్పులు తీసుకువస్తాం : పురపాలక సంఘ వ్యాప్తంగా నెల రోజుల్లో పారిశుధ్యంలో సమగ్ర మార్పులు తీసుకు వస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. పట్టణ పారిశుధ్యంపై ఆయన మాట్లాడుతు తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అయితే మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందన్నారు. దీని కోసం వారంలో ఆరు రోజులు గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశుధ్య విభాగంలో ఏడుగురు మేస్త్రీలున్నారని వారిని వార్డుల వారిగా విభజించి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గ్యాంగ్ వర్క్ చేయించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు శుభ్రం చేయించాలని మేస్త్రీలకు, శానిటేషన్ సెక్రటరీలకు సూచించామన్నారు. దీంతో పాటు ఇంటింటి చెత్త సేకరణపై సైతం దృష్టి సారించామన్నారు. ఇంటి నుంచి చెత్తను సేకరించిన అనంతరం ఇంటి నెంబరుతో పాటు వారి సంతకాన్ని ప్రత్యేక రిజిస్టర్‌లో తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

యువతను పెడదారి పట్టిస్తున్న జగన్‌సర్కార్ : టిడిపి

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలోని యువతను జగన్ సర్కార్ పెడదారిన పట్టిస్తోందని యువత మద్యం, గంజాయికి బానిస అయ్యేలా చేస్తోందని టిడిపి నాయకులు ఆరోపించారు. మద్యం గంజాయి కి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యపానం నిషేధం అమలు చేస్తామని మేనిఫెస్టో లో పొందుపరచి తీరా అధికారం లోకి వచ్చాక ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి మద్యపాన నిషేధం అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంటు ఉపాధ్యక్షుడు మోపురిశెట్టి చంద్రశేఖర్ తెలుగు యువత అధ్యక్షుడు బాబ్జాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు, టిఎన్ఎస్ఎఫ్ సల్మాన్ ఖాన్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు



రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు

నాలుగు పాడిఆవులు మృతి

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పెడపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు అమీర్‌కు చెందిన నాలుగు పాడియావులు 15 రోజులు వ్యవధిలోనే మృత్యువాత పడ్డాయి. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం అమీర్ కు చెందిన ఒక పాడి ఆవు మృతిచెందింది. ఈ ఆవును రెండు రోజుల క్రితం 30 వేల రూపాయలు పెట్టి రాచువారి పల్లి గ్రామంలో కొనుగోలు చేశానని అంతకుమునుపు మూడు ఆవులు ఒకదాని తర్వాత ఒకటి మూడు రోజులు వ్యవధిలో మృతిచెందాయని బాధిత రైతు అమీర్ వాపోయాడు. ఒక్కొక పాడి ఆవు 25 వేల రూపాయలతో కొనుగోలు చేశానని ఉన్నట్టు ఉండి ఇలా వరుసగా తన ఆవులు మృత్యువాత పడటంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల కంబాలపర్తి గ్రామంలో నాగేంద్ర అనే రైతుకు చెందిన పాడియావు 70 వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేయగా అకస్మాత్తుగా దానికి జ్వరం వచ్చి రెండు రోజులు వ్యవధిలోనే మృతిచెందింది. ఈ విషయాన్ని స్థానిక పశువుల వైద్యులకు తెలిపిన ఎలాంటి ప్రయోజనం లేదని బాధితులు విమర్శిస్తున్నారు. గతంలో ఆవులకు బీమా ఉండేదని ఇప్పుడు అది కూడా లేని కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోయారు మండల వ్యాప్తంగా ఇలా పాడి ఆవులు మృత్యువాత పడుతున్నా పశుసంవర్ధక శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడి ఆవులకు బీమాలేని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని బీమా ఉంటే సగం సొమ్ము అయినా తిరిగి వచ్చేదని రైతన్నలు వ్యాఖ్యానిస్తున్నారు. పాడి ఆవులకు బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పేదవాడి కడుపు కొట్టిన వైసీపీ ప్రభుత్వం


సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న సామకోటి ఆదినారాయణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అన్న క్యాంటీన్లు రద్దుచేసి పేదవాడి నోటి వద్ద ముద్ద లాక్కున్నట్లుగా వైసిపి ప్రభుత్వం వ్యవహరించిందని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి నారాయణ విమర్శించారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఎనుముల పల్లి బస్టాండ్ సమీపంలో టిడిపి హయాంలో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను సెల్ఫీ ద్వారా వైసిపి ప్రభుత్వానికి చూపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి 5 రూపాయలకే కడుపునిండా అన్నం పెట్టాలని చంద్రబాబు రాష్ట్రమంతా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంతోమందికి ఉపయోగపడే క్యాంటీన్లను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న మంచి పథకాలు కొనసాగించాల్సిన నైతిక బాధ్యత ఆ ప్రభుత్వానికి ఉందన్నారు.

మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగంనిర్మల రెండు రోజుల క్రితం కౌన్సిల్ సమావేశంలో తన రాజీనామా పత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి లింగం నిర్మల రాజీనామాను పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా లింగంనిర్మల మాట్లాడుతూ తాను ఛైర్‌పర్సన్‌గా కొనసాగిన కాలంలో సహకరించిన అధికారులు, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కంపోస్టు యార్డులో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుడు లింగన్న ప్రమాదవ శాత్తు గాయపడి చేయిని కోల్పోయిన నేపథ్యంలో పాలకవర్గ సభ్యులు సేకరించిన రూ.66,500 నగదును లింగన్నకు అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్ఒ ఆనంద్, ఇఇ సత్యనారాయణ, డిఇలు వన్నూరుస్వామి, సుధారాణి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


లింగన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సకాలంలో వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి ముదిగుబ్బ రూరల్

ఆసుపత్రికి వైద్యకోసం వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మండలంలోని జొన్నలకొత్తపల్లిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బందికి అంగన్వాడీ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. అంతకు ముందు నాడు నేడు పథకం కింద జరుగుతున్న పనులు పరిశీలించారు. పొడరాళ్లపల్లి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన రామస్వామి తండా విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పొడరాళ్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ గర్భిణులకు, పిల్లలకు అందుతున్న పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్‌యునిట్ అధికారి డాక్టర్ కుల్లాయప్పనాయక్, డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ విజేతలకు సన్మానం

హిందూపురం : రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలచిన కళాశాల విద్యార్థులను ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, అధ్యాపకులు కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతు 8వ రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్ షిప్ పోటీలు కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో జరిగాయి. ఈ ఛాంపియన్‌షిప్ పోటీలలో బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టుపై ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు గెలిచి ప్రథమస్థానంలో నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి చదువుతున్న వందన, హేమలత ప్రాతినిధ్యం వహించి జట్టు గెలుపునకు కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, అధ్యాపకులు వెంకటేశులు, యశోదాదేవి, శ్రీలక్ష్మి, యశోదారాణి, సుభాషిణి, వినోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో అర్హులకు అన్యాయం : టిడిపి


వృద్ధురాలితో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అర్హులకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండలంలోని కప్పల బండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన గుర్రం సుబ్బమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలి ఇంటికి వెళ్లిన పల్లె రఘునాథరెడ్డి ఆమె సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దీంతో సుబ్బమ్మ తనకు జరుగుతున్న అన్యాయాన్ని పల్లె దృష్టికి తీసుకువచ్చారు. అన్ని అర్హతలు ఉన్నా తనకు పింఛను రావటం లేదని వాపోయారు. గత టిడిపి ప్రభుత్వంలో తనకు పింఛను వచ్చేదని వివరించారు. వైసిపి ప్రభుత్వం రాగానే తనకు పింఛను నిలిపివేశారని వాపోయారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలన్నీ అందజేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ కు ఇది కానరాలేదా అని పల్లె రఘునాథరెడ్డి ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా 150 మందికి పైగా పింఛన్లు తొలగించారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మీ సమస్యలను తీరుతాయని బాధితులకు పల్లె హామీ ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామంలోని బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను ఆకాలనీవాసులు పల్లె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, రత్నప్ప చౌదరి, అంబులెన్స్ రమేష్, ఉపేంద్ర, ఓబులేసు, మాజీ సర్పంచి చంద్రశేఖర్, బొమ్మయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్త చెరువులోనే దర్గా కాలనీ, ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు శుక్రవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి జిల్లా అధికారప్రతినిధి వలిపి శ్రీనివాసులు మాట్లాడుతూ దర్గా కాలనీ, ఎస్సీకాలనీల్లో డ్రయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్ల మీదనే ప్రవహిస్తోందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలా నరసింహులు, పెద్దన్న, ఇనయతుల్లా, సోహల్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన శ్రీనాథ్ (25) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బీడుపల్లికి చెందిన శ్రీనాథ్ కియా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతనికి ఏడాది క్రితం వివాహమైంది. పట్టణంలోని గణేష్ సర్కిల్ లో గల ఒక అపార్ట్మెంట్ రూంలో భార్య భర్త కాపురం ఉన్నారు. అయితే భార్య కాపురానికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన శ్రీనాథ్ శుక్రవారం రూములో ఫ్యాన్‌కు తాడుతో బిగించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకోన్నాడా? ఇంకా వేరే కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి చెప్పారు.

కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-గోరంట్ల

కర్నాటక నుంచి గోరంట్ల మండలానికి అక్రమంగా కర్నాటక మద్యం రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నల్లమాడ మండలంలోని మస్క వంకపల్లికి చెందిన రామ్మోహన్‌తో పాటు కర్నాటకలోని గూడూరు గ్రామానికి చెందిన పవన్‌కుమార్, జనార్ధన అనే వ్యక్తులు గోరంట్ల మండలంలోని వివిధ ప్రాంతాలకు కర్నాటక మద్యం సరఫరా చేస్తుండగా శుక్రవారం అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకొన్నట్లు సిఐ తెలిపారు

రొద్దం: కర్నాటకలోని దొమ్మితమర్రి నుంచి పెనుకొండ మండల పరిధిలోని శెట్టిపల్లికి అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న శెట్టిపల్లికు చెందిన శివారెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. మడకశిర నుంచి పెనుగొండ వైపు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చెరుకూరు చెక్‌పోస్టు వద్ద జమేదార్ భీమ్లా నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. దీంతో అతడి వద్ద కర్నాటకకు చెందిన మద్యం (ఓల్డ్ ఛాయిస్ 50 పాకెట్లు 90 ఎం.ఎల్) పట్టుబడగా రొద్దం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

బుక్కపట్నం : పోలీసులు తమ విధి నిర్వహణలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు.శుక్రవారం సాయంత్రం స్థానిక స్టేషను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని పోలీసుల స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల సౌకర్యం గతంలో పోలీస్ క్వార్టర్స్ ఉండేదని, కాలక్రమేణ శిథిలావస్థకు చేరుకోవడంతో క్వార్టర్స్ ను తొలగించారని ఎస్పీకి వివరించారు. పోలీసులసంక్షేమం కోసం ఈ స్థలాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ జయ నాయక్, ఎస్ఐ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుకు అవార్డు

చిలమత్తూరు : మండలంలోని టేకులోడు సచివాలయంలో మహిళ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న సాహిన బేగం తన విధులులో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అవార్డు వరించింది. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాదవ్ రెడ్డి చేతుల మీదుగా ఆమె అవార్డును శుక్రవారం అందుకుంది. ఈ సందర్భంగా మహిళ పోలీస్ సాహీనాను సచివాలయ సిబ్బందితో పాటు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు అభినందించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ధర్మవరం టౌన్ : రైల్వే అధికారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ధర్మవరం రైల్వే సిఐ నాగరాజు, ఎస్ఐ గోపీ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. తలుపుల మండలం గొల్లపల్లితండాకు చెందిన దేవలానాయక్ కుమారుడు తేజేశ్వర్నాయక్ ఈనెల 3న కదిరి రైల్వేస్టేషన్లో రైలు కదిలే సమయంలో కదిరి నుండి నల్లచెరువు వెళ్లే రైలు మార్గం డ్యామేజీ అయిందని కదిరి రైల్వేస్టేషన్ మాస్టర్‌కు అజ్ఞాత వ్యక్తిగా ఫోన్లో సమాచారం అందించారు.దీంతో రైల్వే అధికారులు రైలును 65 నిమిషాలు ఆపి లైన్ చెక్ చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చి రైల్వే అధికారుల సమయాన్ని వధా చేయడమే కాకుండా ప్రయాణీకులకు ఇబ్బందులు కల్గించిన నేపథ్యంలో గుంతకల్లు రైల్వే ఎస్ఆర్‌పి చాముండేశ్వరి దేవి తీవ్రంగా పరిగణించి కేసు నమోదు చేశారు. విచారణ జరిపి రైలు అవాంతరానికి కారణమైన తేజేశ్వర్‌నాయక్ అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్పీఎఫ్ సిఐ బోయకుమార్, కదిరి రైల్వే ఎస్ఐ రహీం, ఎఎస్ఐ శివారెడ్డి, రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్ : రాబోయే మూడు రోజులపాటు తుఫాను ప్రభావం ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను వల్ల మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా విపత్తులు సంభవించినా, ప్రజలు ఇబ్బందులతో చిక్కుకున్నా కంట్రోల్ రూమ్ కు 9154968578కి ఫోన్ చేస్తే తగు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని, ఎలాంటి ప్రమాదాలు సంభవించిన కంట్రోల్‌రూమ్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శివనగర్ లో ఉన్న పురాతన బచ్చు నాగంపల్లి కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన శుక్రవారం వైభవంగా జరిగింది. దాతలు గుర్రం రాజ, గుర్రం రాధ రూ. 10లక్షల వ్యయంతో ధ్వజస్తంభాన్ని నిర్మించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సోదరుడు, వైసిపి నాయకుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ చేనేత ప్రముఖులు సిద్ధిరాజేష్, కాచర్ల అంజి, ఉక్కిశిల గోవిందు, లాయర్ క్రిష్ణ, రామచంద్ర, వడ్డీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


బాగేపల్లి న్యూస్...

అభివృద్ధే అజెండాగా సిపిఎం ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

కర్నాటక బాగేపల్లి విధాన సభ ఎన్నికల్లో పోటీలో ఉన్న సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. సిపిఐ(ఎం) వైపు అన్నీ వర్గాల ప్రజలు మక్కువ చూపడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే అజెండాగా కదులుతున్న సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ అభివృద్ధి ప్రణాళికను ప్రకటించిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు అటు వైపు మక్కువ చూపుతున్నారు. మహిళ సంఘాల పేరిట సాగుతున్న వడ్డీ వ్యాపారాన్ని రూపుమాపి కేరళ తరహాలో సొసైటీ ఏర్పాటు చేస్తామని సిపిఎం అభ్యర్థి ప్రకటించడంతో ఎక్కడ చూసినా మహిళలు అధికసంఖ్యలో ఎన్నికల ప్రచారంలోకనిపిస్తున్నారు. మరో వైపు డాక్టర్ అనీల్ కుమార్ సతీమణి డాక్టర్ మంజుల ఇంటింటి ప్రచారం చేపట్టడంతో ఆమెకు మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు. మహిళలు ఈ స్థాయిలో పార్టీ వైపు మక్కువ చూపడం ఇదే తొలిసారి. మరో వైపు ముస్లిం మైనారిటీలు, దళితులు, విద్యార్థులు, యువకులు, రైతులు, కార్మికులు, ప్రజాసంఘాలు, మేధావులు సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ కు స్వచ్ఛంద మద్దతు తెలియజేస్తూ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారం సందర్భంగా చెప్పిందే ప్రణాళికగా మార్చుకున్నామనిఅభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ చెప్పిన మాటలకు ప్రజలు పూర్తిగా సిపిఐ(ఎం) వైపు మరలుతున్నారు. అయితే ఈ జనాదరణ కాంగ్రెస్, బిజెపి అభ్యర్థుల లేకపోవడం గమనార్హం.




సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌ను, ఆయన సతీమణి మంజులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు